G. PUNDA



# దాగుడుమూతలు

మధురాంతకం రాజారాం

యాత్ర పూర్తిచేసుకొని ఊరికి తిరిగి వస్తుండగా మా ఆవిడ ఒక చిత్రమైన కోరిక బయటపెట్టింది. ఏం లేదు. మార్గమధ్యంలో ప్రయాణం ఆపుచెయ్యాలి. ఒకానొక పట్టణంలో కొద్ది గంటలసేపు మజిలీ వెయ్యాలి. ఇంతజేసీ అదొక పుణ్యస్థలమేమీగాదు. అక్కడ చూడదగ్గ విశేషాలు గూడా లేవు. ఏ పని చేసినా దానికొక అర్థం వుండాలి. మా ఆవిడయినా ఉద్దేశరహితంగా ఈ నిర్ణయానికి వచ్చి వుండదని నా నమ్మకం. కానీ తన ఆంతర్యమేమిటో చెప్పదు. దిగాలి, దిగుదామని మాత్రం అంటుంది. నాతో దాగుడుమూత లాడడమంటే భలే సరదా మా రాజ్యానికి!

దిగాము. హోటలుగదిలో స్నానపానాదులు ముగించి, కొంతసేపు సేద దీరిన తర్వాత రాజ్యం పైకిలేచి పెట్టె తెరిచింది. ఆ ముస్తాబవుతున్న వాలకాన్నిబట్టి చూస్తే బయటకి వెళ్లడానికి ఆయత్తమయ్యే సూచనలు కానవస్తున్నాయి. సూచనలేం కర్మ! కాసేపటికి చెప్పనే చెప్పేసింది. "అలా తెల్లబోయిచూస్తూ కూచున్నారేమండీ! లేవండి. వెళ్ళొచ్చేద్దాం."

కళ్ళకు గంతలు కట్టించుకుని యింత దూరం వచ్చేశాక, యిప్పుడిక యిక్కడికని ఎలా అడగ్గలను? నా లోలోపల ఆత్మాభిమానం బుసలుకొడుతోంది. అయినా బయటపడిపోవడానికి మనస్కరించక "నేనెందుకూ! నువ్వెళ్ళి రారాదా రాజ్యం! ఇరవై అయిదేళ్ళు కాపురం చేసినవాణ్ణి, యిప్పుడీ వూళ్ళో నిన్ను దిగవిడిచి వెళ్లిపోతానా? ఏం భయపడొద్దు. నీ కోసం యిక్కడే వేచి వుంటాను" అన్నాను.

నా కోపం అవధులు దాటుతూ వుందని రాజ్యం చప్పున గ్రహించేసింది. వినయ గారాలవిద్యకు ఉపక్రమణికగా నా వైపు ఓరకంటితో చూస్తూ "బాబ్బాబూ నన్ను ముప్పతిప్పలు పెట్టకండి! అసలేం జరిగిందో చెప్పేస్తాను" అంటూ కదిలివచ్చి నా ఎదుట కుర్చీలో ఆసీనురాలైంది.

"చెప్పు" అన్నాను ముక్తసరిగా.

"పదేళ్ళ క్రితం.... ఒకనాడు."

"ఉండుండు. ఇలాంటి ఘట్టాల్లో విధిగా వాతావరణ వర్ణనచెయ్యాలి. ఆనాడాకాశం నీలి జలధర ప్లావితమై వుందనిచెప్పు. లేదా ఎండలు విచ్చుకత్తుల్లా మెరుస్తున్నాయని చెప్పు. కాదా చలిగాలులు ఎముకల్ని కొరికేస్తున్నాయని చెప్పు."

"అబ్బే. వూరుకుందురూ!" ప్రాధేయపడింది రాజ్యం. "ఆ రోజులాంటి అవాంతరాలేం లేవు లెండి! ప్రశాంతంగానే తెల్లవారింది. భోజనంచేసి మీ రాఫీసుకు వెళ్లడానికి తయారౌతున్నారు. మీకు జ్ఞాపకముందో లేదో అప్పుడు నేనొక ప్రశ్న వేశాను."

ఆలోచించడం వృధా ప్రయాస. రాజ్యం రోజుకు వంద ప్రశ్నలయినా అడుగుతుంది. టేపుపైన రికార్డు చేసి పెట్టుకుంటే గానీ వాటిని పునస్స్మరణ చేసుకునే అవకాశం లేదు.

"ఏమంత గహనమైన ప్రశ్న గాదు. మీ పుట్టిన తేదీ చెప్పమన్నాను. అడిగిన ప్రశ్నకు సజావుగా సమాధానం చెప్పే అలవాటు హఠాత్తుగా రమ్మంటే వస్తుందా? ఎందుకో చెప్పమన్నారు మీరు. ఎందుకో చెబితే మీరసలు చెప్పనే చెప్పరని నాకు తెలుసు. ఎలాగో మీచేత చెప్పించాను. ఆ తరువాత అలాంటిదే ఇంకొక ప్రశ్న. మీ జన్మ నక్షత్ర మేమిటి అని!"

"కొంపదీసి చెప్పేశానా ఏమిటి!" నా కుతూహలంలో నాకు ఊపిరాడడం లేదు.

"మీరు చెప్పారనడం బాబు గాదు. నేనే చెప్పించుకున్నాను." రాజ్యం చివాలున పైకిలేచి మళ్ళీ పెట్టె దగ్గరికి వెళ్ళింది. అట్టడుగునుంచి ఓ చీటీ ముక్క పైకి తీసింది. మడతలు విప్పుకుంటూ వచ్చి, దాన్ని నా చేతిలో పెట్టింది.

పదేళ్ళ క్రిందటి వార్తా పత్రికలోనుంచీ పదిలంగా చించి పెట్టుకున్న ఆ కాగితం ముక్కలో ఓ ప్రకటన మాత్రమే వుంది. "పుట్టిన తారీఖు, జన్మ నక్షత్రం తెల్పుతూ రు. 5 మనియార్డరు చేస్తే మీరు కోరిన మూడు ప్రశ్నలకు సమాధానం వ్రాసి పంపబడును."

ప్రకటన క్రింద కానవచ్చిన దైవజ్ఞుడి చిరునామా చూడగానే నా కళ్ళకడ్డంగా ఉన్న గంత కొంచెంగా విచ్చుకున్నట్టయింది. ఆయనగారుండడం ఈ వూళ్ళోనే!

"త్రిప్పి చూడండి. నేను కోరిన ప్రశ్నలు గూడా అందులోనే వున్నాయి" అంది రాజ్యం.

త్రిప్పి చూచాను. పాతబడి పోవడం వల్ల ఆ పెన్సిల్ వ్రాత సరిగ్గా కంట కానడం లేదు. కూడి, కూడి చదువుకోగలిగాను. ఒకటి ప్రమోషనెప్పుడు వస్తుంది? రెండు. నాలుగైదేళ్ళలోనా స్వంతయిల్లు కట్టుకోగలమా? మూడు. ఈ జాతకుడికి విదేశ యాత్రలకు వెళ్ళే యోగముందా?


అయిదు రూపాయల సంభావనతో దైవజ్ఞుడికి పంపుకోబడ్డ ప్రశ్నలు! వాటి వైపు చూస్తుంటే రాజ్యం అమాయకత్వానికి నవ్వాలో ఏడవాలో తోచడం లేదు.

"చూడు రాజ్యం! ఈ మాత్రం ప్రశ్నలకు జ్యోతిష్కుడి దాకా వెళ్ళవలసిన అవసరం లేదు. నన్నడిగి వున్నట్టయితే సమాధానం చెప్పేవాణ్ణి! ఒళ్ళు దాచుకోకుండా ఉద్యోగం చేసేవాడికి ప్రమోషననేది ఎప్పుడో ఒకప్పుడు రానే వస్తుంది. దుబారా చేయకుండా రాబడిలో ఎంతో కొంత దాచిపెట్టుకునేవాడు తన స్థాయికి తగ్గట్టు ఒక ఇల్లు కట్టుకోవడం గూడా అసాధ్యమేమీ గాదు. ఇటొచ్చి, ఈ మూడో ప్రశ్న దగ్గరే వస్తుంది చిక్కు. నీ జ్యోతిష్కుడు గూడా ఇక్కడే పప్పులో కాలువేసి వుంటాడనే నా ఊహ!"

"అదేం లేదు. అచ్చు గుద్దినట్టు ఆయన నికరంగానే చెప్పేశాడు. విదేశ యాత్రల మాట చెప్పడానికి లేదు. దేశ యాత్ర చేయడం మాత్రం ఖాయం అని!"

"ఆ జాతక ఫలం మేరకు మన కిప్పుడు యాత్రాయోగం పట్టిందన్న మాట! అవునా రాజ్యం?"

"బాబూ! ఎవరి నమ్మకాలు వాళ్ళవి! మీ కెందుకూ: మీరు నాతో రండి! అడగవలసిన ప్రశ్నలేవో నే నడుక్కుంటాను.




మీతో చెప్పగూడని ప్రశ్నలేం కావులెండి. మరేం లేదు. అమ్మాయి పెళ్ళి గురించి, అబ్బాయి ఉద్యోగాన్ని గురించి...."

ఇంతదూరం వచ్చాక ఇక తప్పేదేముంది! సరే, బయల్దేరమన్నాను.

గదికి తాళంవేసి రోడ్డు పైకొచ్చాము. పేవ్‌మెంటుపైన నిలబడి రిక్షాకోసం చూస్తూండగా అడిగింది రాజ్యం.

"అన్నట్టు మీ పుట్టిన తారీఖున్నూ, జన్మ లగ్నమున్నూ జ్ఞాపకమున్నాయటండీ?"

హఠాత్తుగా వెనుకనుంచీ నా తలపైన ఎవరో బలంగా మోదినట్టయింది. నీళ్ళు నములుతున్నానేగానీ మాట పెకలడంలేదు.

"చెప్పరే మండీ!"

"అబ్బే, చెప్పలేకేం రాజ్యం! పుట్టిన తేదీ పదహారు, మార్చి, ఇరవై నాలుగు. నక్షత్రం మృగశిరనుకుంటాను...."

"మృగశిరటండీ మీ జన్మ నక్షత్రం! వాలకం చూడగానే తెలిసిపోదంలా! మీరేదో బుకాయిస్తున్నారు. వుండండి, ఇప్పుడే వచ్చేస్తాను ..."

హుటా హుటిగా మళ్ళీ హోటల్లోకి దారితీసింది రాజ్యం. దోషిలా మెల్లగా ఆమెను వెంబడించాను.

గది తలుపులు తెరిచి యింకా టేబిలు పైన పడివున్న కవరులోనుంచీ యింకొక కాగితం ముక్క పైకి తీసింది.

"అదిగో! నేనా మరిచిపోయేదాన్ని! మఖా నక్షత్రం మీది! అదేమిటండీ, పుట్టిన తేదీ గూడా యిప్పుడు మీరు చెప్పింది కాదే!"

"చిచ్చుబుడ్డీలా మండిపడకపోతే చెబుతాను రాజ్యం! నేనిప్పుడు చెప్పిందెంత నిజమో, అప్పుడు చెప్పింది గూడా అంతే నిజం! నిజానికి మా నాన్నగారు నా పుట్టుకను గురించిన వివరాలేవీ రాసిపెట్టలేదు. ఆ మాటకొస్తే పెళ్ళి సంబంధం చూచుకున్నప్పుడు మీ నాన్నగారికి పంపించింది గూడా అల్లాటప్పా జాతకమే! తప్పాయన్ని. నాదిగాదు."

గాలి తీసేసిన బెలూనులా రాజ్యం కుర్చీలో కూలిపోయింది!

★★★